క్లుప్తంగా

పూలాభిషేకం



పుష్పాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికులకు లాభాలు ప్రకటించి దసరా పండుగ సందర్భంగా బోనస్ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీల చిత్రపటాలకు సింగరేణి కార్మికులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ మట్టా దయానంద్, పీఓ ప్రహ్లాద్, సింగరేణి కార్మిక సంఘాల నాయకులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

చింతకాని: మండల పరిధిలోని మత్కేపల్లి గ్రామంలో లబ్ధిదారులకు బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన అమరగాని కనకమ్మ, పగడాల నందిని, ఎరకల బోయిన లక్ష్మి, బండి జానమ్మలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో మంజూరైన రూ.1.71 లక్షల చెక్కులను అందజేశారు. పార్టీ నాయకులు బందెల నాగార్జున్, కంచం కోటేశ్వరరావు, తిరుపతి అంజయ్య, బొల్లకొండ రామారావు, వలమల రామారావు, నాగేశ్వరరావు, వెంకట్రామయ్య, రామ్మూర్తి, పుల్లయ్య, గోపి, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

కల్లూరురూరల్: నాలుగు నెలలుగా వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నామని, వెంటనే వేతనాలు చెల్లించాలని మిషన్ భగీరథ కార్మికులు బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గ మిషన్ భగీరథ కార్మికుడు చంద్రబోయిన గాంధీ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఉబ్బన రఘు, జంగం నర్సింహారావు, ఉబ్బన వేణుబాబు, వి.రమేశ్, సిహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో గత రెండు నెలల వ్యవధిలో మూడు డెంగీ కేసులు నమోదు కావడంతో పాటు జ్వరాల తీవ్రత అధికంగా ఉండడంతో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి డెంగీ, మలేరియా తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి స్రవంతి, వైద్యసిబ్బంది కావ్య, రవళి, దానయ్య, సుబ్బలక్ష్మి, పద్మ, ఫాతిమా, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

పరామర్శ

వేంసూరు: రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం రాత్రి మండలంలోని వెంకటపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిని, కందుకూరు గ్రామానికి చెందిన ఏఎంసీ వైస్ చైర్మన్ గొర్ల వెంకటప్పరెడ్డిలను పరామర్శించారు. జంగ శ్రీనివాసరెడ్డి, కొప్పుల వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తల్లాడ: తల్లాడలో వేంచేసి ఉన్న హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 2వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా సుప్రభాత సేవ, చిన్న స్వామికి శేష వాహనోత్సవం, భగవత్ ప్రార్థన, విష్వక్సేనారాధన, పుణ్యావాచనం, అఖండస్థాపనం, మృత్సంగ్రహణం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్ఠాపన, గరుడపట ప్రతిష్ఠ, ధ్వజారోహణం, చిన్న శ్రీనివాసస్వామి వారికి ముత్యపు పందిరి సేవ, హారతి వంటి కార్యక్రమాలతో ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

పత్తి సాగుపై వర్క్‌షాప్

వైరా: వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తిలో దగ్గరి సాళ్ల పద్ధతిపై వర్క్‌షాప్ నిర్వహించారు. మధిర ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రుక్మిణీదేవి, అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జె.హేమంత్‌కుమార్, ఎకనామిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణతేజ, వైరా కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి.సుచరిత, కీటక శాస్త్రవేత్త డాక్టర్ టి.పావని, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఫణిశ్రీ పత్తిలో దగ్గరి సాళ్ల పద్ధతి, అధిక వర్షాలు, చీడ పీడల నివారణ, సస్యరక్షణ చర్యలు, సమగ్ర యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మిర్చి సాగు వెనక్కి..



ఎడతెరపిలేని వానతో ఊట పట్టిన మిర్చి చేను

తెరిపి ఇవ్వని వానలతో రైతుల కుదేలు

- ఫలితంగా మిర్చి తోటల్లో ఊటలు
- మొక్కలు కుళ్లిపోతున్నాయని ఆందోళన
- ఆపై తోటలను ఆశిస్తున్న తెగుళ్లు

కారేపల్లి: అసలే పక్షం రోజుల వెనక కొందరు రైతులు మిర్చి నారు నాటారు. ఆపై ఎడతెరిపి లేకుండా వాన కురుస్తుండడంతో మిర్చి తోటలు ఊటలు పట్టి, మొక్కలకు తెగుళ్ల సోకి కుళ్లిపోతున్నాయి. ఫలితంగా ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేస్తే... ఎంతకూ వదిలిపెట్టని వానతో ఆదిలోనే కోలుకోలేని దెబ్బ పడినట్లయింది. మొక్కలు నాటిన రెండు వారాలకే తెగుళ్లు సైతం సోకుతూ పంటంతా కుళ్లిపోతోంది.

తగ్గిన సాగు..

కారేపల్లి మండలంలో ఈ ఏడాది 4వేల ఎకరాల్లో రైతులు మిర్చి సాగు చేస్తున్నారు. గత ఏడాది 7వేల ఎకరాల్లో సాగు చేయగా, తెగుళ్లు, అధిక పెట్టుబడులు, గిట్టుబాట ధర లేక ఈ ఏడాది విముఖత చూపారు. రూ.లక్షల్లో అప్పు తెచ్చి పెట్టుబడి పెడితే అంతమందం కూడా రాకపోవటంతో రైతులు ఆర్థికంగా దెబ్బతినడమే కాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఫలితంగా ఈ ఏడాది మిర్చి సాగుకు వెనక్కి తగ్గారు. మండల వ్యాప్తంగా సుమారుగా 3వేల ఎకరాల్లో మిర్చి పంట తగ్గగా.. ఆ స్థానంలో పత్తి, మొక్కజొన్న, ఆయిల్‌పామ్ వైపు మొగ్గు చూపారు.

కుళ్లిపోతున్న మొక్కలు

ఎడతెరపిలేని వానలతో మిర్చి చేన్లు ఊటలు పట్టాయి. వేసిన రెండు వారాలకే మిర్చి మొక్కలు కుళ్లిపోతున్నాయి. మండలంలోని కారేపల్లి, గేటుకారేపల్లి, విశ్వనాథపల్లి, మాణిక్యారం, రేలకాయలపల్లి, చీమలపాడు, మాధారం, కమలాపురం, ఉసిరికాయలపల్లి, పేరుపల్లి, పోలంపల్లి, కోమట్లగూడెం, ఉసిరికాయలపల్లి, సీతారాంపురం తదితర గ్రామాల్లో ఈ పరిస్థితి తీవ్రంగా ఉండగా రైతులు దిగాలు చెందుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.లక్ష పెట్టుబడి పెట్టామని, అయినా మొక్కలు బతికే పరిస్థితి లేదని వాపోతున్నారు. చేసేదేం లేక కొందరు పంట దున్నేసి మొక్కజొన్న, జొన్న తదితర పంటల సాగుకు ఆలోచనలో పడ్డారు. ఇదే సమయాన ఇంకొందరు చచ్చిపోయిన మొక్కలు తొలగించి ఆ స్థానంలో కొత్తవి నాటుతున్నారు.



చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటుతున్న రైతులు

మళ్లీ మొక్కలు నాటుతున్నాం



రెండెకరాల్లో మిరప నాటాం. ఎకరాకు అంతా కలిపి రూ.లక్ష వరకు ఖర్చయింది. వరుస వానతో మొక్కలన్నీ చచ్చిపోవడంతో ఫలితం దక్కేలా లేదు. అందుకే కొత్తవి నాటుతున్నాం. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– ధరావత్ భీక్షం, వెంకిట్యాతండా

తెగుళ్లు సోకి కుళ్లిపోతున్నాయి..



ఊట పట్టి తెగులు సోకి మొక్కలు కుళ్లిపోతున్నాయి. గతేడాది నాలుగెకరాల్లో సాగు చేస్తే నష్టం రావడంతో ఈసారి రెండెకరాల్లో నాటా. ఇప్పుడు వానతో నష్టం వస్తోంది. ఈ ఏడాది కూడా సరైన దిగుబడి కష్టమే.

– వాంకుడోతు రాంచందర్, సామ్యాతండా

నివారణ చర్యలు తప్పనిసరి



వ్యాధి కనిపించగానే మొక్కలు తొలగించాలి. నివారణకు నీటితో కలిపి మెటలాక్సిన్, మాంకోజెబ్ (2.5 గ్రా/లీటరు) కాండం వద్ద పోయాలి. బాక్టీరియా లక్షణాలు ఉంటే స్ట్రెప్టోసైక్లిన్, కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాములను 10లీటర్ల నీటికి కలిపి మొక్కపై పిచికారీ చేయాలి. మిర్చి తోటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

– ఆకుల వేణు, వైరా డివిజన్ ఉద్యానవన అధికారి

దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యంగా పెట్టారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

– సాక్షినెట్‌వర్క్



ఎర్రుపాలెం: జమలాపురంలో భక్తుల పూజలు

వైద్యమంటే ప్రభుత్వానికి నిర్లక్ష్యం

మధిర: ప్రజల ఆరోగ్యం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చులకనగా వ్యవహరిస్తుందని జెడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. మధిర ప్రభుత్వ ఆస్పత్రి శిథిలావస్థకు చేరి సౌకర్యాలు లేక, వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన బుధవారం స్థానిక సివిల్ ఆస్పత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించేందుకు డిప్యూటీ సీఎంకు తీరిక లేదా అని ప్రశ్నించారు. స్థానిక శాసనసభ్యులు పట్టించుకోనందున వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పందించి ఆస్పత్రిని ప్రారంభించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, చావా వేణు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, ధీరావత్ మాధవి, సయ్యద్ ఇక్బాల్, బొగ్గుల వీరారెడ్డి, ఐలూరి ఉమామహేశ్వర్ రెడ్డి, కపిలవాయి జగన్ మోహన్‌రావు, నరసింహారావు, నాగబాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

ఇళ్లు మంజూరు చేయాలని నిరసన



పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

మధిర: అర్హులైన తమకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని కోరుతూ చిలుకూరు జీపీ కార్యాలయం వద్ద గ్రామస్తులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు మాట్లాడుతూ.. చిలుకూరు గ్రామాన్ని మోడల్ విలేజ్‌గా మార్చుతామని కేవలం 37 మందితోనే లబ్ధిదారుల జాబితా వచ్చిందన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో గ్రామంలోని లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఊట్ల శంకర్‌రావు, రామకృష్ణ, బాజినేని వెంకటనరసయ్య, అంగడాల అమరయ్య, లాలు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


సీపీఎం నాయకుల పాదయాత్ర

చింతకాని: ఇందిరమ్మ ఇళ్లు, యూరియా కొరత, పంట నష్ట పరిహారం వంటి సమస్యలపై సీపీఎం ఆధ్వర్యాన బుధవారం మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామం నుంచి చింతకాని వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. లబ్ధిదారుల ఎంపికపై సర్వే చేయాలని, సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలని, దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రేపల్లెవాడ గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటను నాయకులు పరిశీలించాక తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం పాదయాత్రకు బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రైతు సంఘం నేతలు, నాయకులు సామినేని రామారావు, గోపాలరావు, రాము, జానికి రాములు, వీరబాబు, అప్పారావు, రవి, జానికి రామయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే, మండల పరిధి నాగిలిగొండ గ్రామానికి చెందిన చాట్ల మరియదాసు కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీఆర్‌ఎస్ మండల నాయకులు బుధవారం తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. బొడ్డు వెంకట్రామయ్య, హనుమంతురావు, రమేష్, శ్రీను, సురేష్, భగవాన్, సిలార్‌సాహెబ్, గోపాలరావు, రమేష్ పాల్గొన్నారు.

సేవాదృక్పథం అలవర్చుకోవాలి

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన, పాటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజసేవలో తమవంతు బాధ్యతను నిర్వర్తించి భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

– సాక్షినెట్‌వర్క్



చింతకాని: నాగులవంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నవీన్‌బాబు

మంత్రి పర్యటన ప్రదేశాల పరిశీలన

కల్లూరు: కల్లూరులో నేడు(గురువారం) మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిలు పర్యటించనున్న ప్రదేశాలను బుధవారం సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ పరిశీలించారు. అలాగే కల్లూరు పట్టణంలో జరుగుతున్న పీఎం ఆవాస్ యోజన సర్వే జరుగుతున్న వార్డులను మున్సిపల్ కమిషనర్ ఎ.సంపత్‌కుమార్, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావులు పరిశీలించారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, ఏఎంసీ చైర్మన్ బాగం నీరజాదేవి పాల్గొన్నారు.

దళితులకు రుణాలు అందడం లేదు

బోనకల్: 2018 నుంచి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు దళితులకు అందడం లేదని వెంటనే రుణాలు మంజూరు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ కోరారు. స్థానిక సీపీఎం కార్యాయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 29న నారాయణపురంలో జరిగే మహాసభకు నిరుద్యోగులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యులు నోముల పుల్లయ్య, మండల కార్యదర్శి రమేష్, ఉప్పర శ్రీను, ఏసుపోగు బాబు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

వైరా: వైరా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.వరప్రసాద్ బుధవారం వైరాలో వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువపత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానా విధించారు.

పేటచెరువు టూరిజానికి రూ.4.86 కోట్లు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు పేట చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రూ.4.86 కోట్లు మంజూరు చేసినట్లు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పేటచెరువును పర్యటక శాఖ ఏఈ నరేశ్, స్థానిక నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో అనుమోలు వెంకటకృష్ణారావు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఐలమ్మ జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా 'తమ్మారపు'



తమ్మారపు బ్రహ్మయ్య

బోనకల్: ఈ నెల 26న హైదరాబాద్‌లో నిర్వహించే చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలకు కన్వీనర్‌గా గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన తమ్మారపు బ్రహ్మయ్యను ఎంపిక చేస్తూ జీఓ జారీ చేశారు. ఈమేరకు అవకాశం కల్పించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

కల్లూరు: హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి కల్లూరు మాజీ జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుసునూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా బతుకమ్మ సంబురాలు..



సత్తుపల్లిటౌన్: బతుకమ్మలతో ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లిటౌన్: బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే

బతుకమ్మ సంబరాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం నానాబియ్యం బతుకమ్మ వేడుకలు కనులపండువగా జరిగాయి. ఈసందర్భంగా మహిళలు తీరొక్క పూలతో పూలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సందడి చేసి చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు.

– సాక్షినెట్‌వర్క్



వైరా మేరీ ఇమాక్యులేట్ పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు



వైరా న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో బతుకమ్మలతో పాఠశాల సిబ్బంది

మత్స్యకార సంఘం నుంచి ఇద్దరు బహిష్కరణ

సత్తుపల్లి: గత పాలకవర్గంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు రుజువు కావడంతో అప్పటి అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, పాదిలి నర్సింహారావులను బహిష్కరించినట్లు బేతుపల్లి గంగారం మత్స్యకార సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఊకే కన్నారావు, కొండా జయరాజు తెలిపారు. సత్తుపల్లి మండలం గంగారం చాకలి ఐలమ్మ భవనంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. 12 ఏళ్ల సంఘాన్ని అడ్డుపెట్టుకొని చేసిన అక్రమాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించి రెండుసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతోసభ్యత్వాన్ని తొలగిస్తున్నట్లు చెప్పారు. గిరిజన మత్స్య సహకార బేతుపల్లి గంగారంను బేతుపల్లి గంగారం మత్స్య సహకార సంఘంగా మార్చడంతో కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే 90శాతం రాయితీ కోల్పోయామని, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి 2014లో వచ్చిన రూ.6.60 లక్షల మొత్తాన్ని దిగమింగేశారని, 2017లో సంఘానికి వచ్చిన రూ.8 లక్షల విలువైన టాటా ఏసీ వాహనాన్ని అమ్మేశారని తెలిపారు. రూ.10 లక్షల విలువైన చేపలను చెరువులో వేయకుండా వారిద్దరు అడ్డుకోవడంతో అవి చనిపోయాయని, సంఘంలో సభ్యులు కానీ బొమ్మకంటి మహేష్‌కు టీవీఎస్ ఎక్సెల్ వాహనం ఇచ్చారని, 2010–12లో శాశ్వత సభ్యత్వం ఉన్న 15 మందిని తొలగించి తమకు అనుకూలమైన వారిని చేర్పించుకున్నారన్నారు. ఆడిట్‌లో ఈ అవినీతి అక్రమాలు వెలుగు చూశాయన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు కాక రామచంద్రరావు, పాదిలి శ్రీనివాసరావు, నీలాల నర్సింహారావు, బొందల రాంబాబు, కొర్సా మహాలక్ష్మి, సభ్యులు ఊకే రమేష్, వాడే మల్లేష్, నేరేడి ఆనందరావు, శివకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విద్యుత్ శాఖ పొలంబాట



అవగాహన కల్పిస్తున్న ఏఈ గణేష్

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తక్కెళ్లపాడు గ్రామంలో విద్యుత్ శాఖాధికారులు పొలంబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ వి.గణేష్ వర్షాకాలంలో విద్యుత్ వినియోగంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు షేక్ మౌలానా, జార్జ్, అసిస్టెంట్ లైన్‌మెన్ రాజేష్, చక్రి, రైతులు శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, సాంబశివరెడ్డి, గోవింద్‌రెడ్డి, తదితరులున్నారు.

రిజర్వేషన్ల పరిరక్షణకు ఉద్యమిద్దాం..



మాట్లాడుతున్న నందిపాటి మనోహర్

పెనుబల్లి: రాజ్యాంగం, రిజర్వేషన్ల పరిరక్షణకు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని, అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు కేవీపీఎస్ 28వ వసంతాల వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా జెండా ఆవిష్కరణ జరపాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల కేంద్రంలో కేవీపీఎస్ సీనియర్ నాయకులు తాండ్ర రాజేశ్వరరావు అధ్యక్షతన ఆ సంఘం మండల మహాసభ నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. దేశాన్ని పాలిస్తున్న మతోన్మాద శక్తులు తమ మనువాద సిద్ధాంతాలను ప్రజలపై బలవంతంగా రుద్దడమే కాకుండా అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుస్మృతిని తీసుకురావాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం సీఐటీయూ జిల్లా నాయకుడు సీహెచ్ విఠల్ మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం నూతన మండల అధ్యక్ష, కార్యదర్శులుగా మామిడి మారేశ్వరరావు, చిల్లిముంత సీతారాములు, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి వెంకటేశ్వరరావు, సింగిశాల నాగప్రసాద్, సహాయ కార్యదర్శిగా గద్దం శ్రీను, గౌరవ సలహాదారులుగా తాండ్ర రాజేశ్వరరావు, తడికమళ్ల చిరంజీవితో పాటు మరో ఆరుగురు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గాయం తిరుపతిరావు, కృష్ణయ్య, సుందర్‌రావు, వెంకటేశ్వరరావు, సుజాత, నాగులు, ముత్తయ్య, వెంకటరత్నం పాల్గొన్నారు.

రైల్వే గేటు మూసివేత

చింతకాని: మండల పరిధిలోని రామకృష్ణాపురం గ్రామం వద్ద ఉన్న 107వ రైల్వే గేటును ఈనెల 26వ తేదీ నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు మూసివేస్తున్నట్లు రైల్వే మధిర సెక్షన్ సీనియర్ ఇంజనీర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్ మరమ్మతు పనుల కారణంగా ఆరు రోజుల పాటు రైల్వే గేటును మూసివేస్తున్నామన్నారు.

సమస్యల సాధన కోసం పోరాడాలి

సత్తుపల్లిరూరల్: బీసీ బిడ్డల భవిష్యత్ కోసం చేపడుతున్న ఆమరణ దీక్షను విజయవంతం చేసేందుకు కదిలిరావాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ అన్నారు. సత్తుపల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ నెల 26న ఖమ్మంలో తలపెట్టిన ఆమరణ నిరాహార దీక్ష పోస్టర్లను ఆవిష్కరించి, మాట్లాడారు. ఉద్యమానికి జిల్లా వేదిక కావాలని, దీనికి అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తోట సుజలారాణి, ఎండీ కమల్‌పాషా, మౌలాలీ, వినుకొండ కృష్ణ, నాగుల్‌మీరా, కంటే అప్పారావు, వీరివాడ నాగభూషణం, టోపి శ్రీను, దుస్సా వెంకటేశ్వర్లు, మానుకోట ప్రసాద్, నాని నాయుడు, సురేష్, వెంకటేశ్వర్లు, ధర్మతేజ, సాయిలు, నిమ్మగడ్డ శ్రీకాంత్, మల్లెల శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తల్లాడలో..

తల్లాడ: ఈ నెల 26న ఖమ్మం కలెక్టరేట్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. గోగుల రాఘవ, గోవింద్ శ్రీనివాసరావు, కటికి కిరణ్‌కుమార్, చిన్నంశెట్టి శ్రీకాంత్, కటికి ప్రసాద్, షేక్ మీర్జామహబు, పొన్నం కృష్ణయ్య, భూక్యా అంజయ్య పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే

మధిర: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఫ్రెషర్స్‌డే బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కే.సాంబయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకొని దానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వినోద్‌కుమార్, సాంబశివరావు, విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పశుసంపదతో ఆర్థిక స్వావలంబన



గేదెల యూనిట్లను పరిశీలిస్తున్న డాక్టర్ జయవర్ధన్

బోనకల్: పశుసంపదతో మహిళలలో ఆర్థిక స్వావలంబన ఏర్పడుతుందని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) రిసోర్స్ పర్సన్ డాక్టర్ జయవర్ధన్, సీజోలు అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో ఇందిరా డైరీ కింద స్వయం సహాయక సంఘం సభ్యులకు గేదెల యూనిట్లను మంజూరు చేయగా.. వాటిని బుధవారం పరిశీలించి మాట్లాడారు. బోనకల్ మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఇందిరా డైరీ ఏర్పాటుతో పాటు మహిళలను భాగస్వాములు చేసి పశుసంపద, పాల సేకరణకు తదితర వాటిపై వచ్చే లాభాలతో మహిళలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. సెర్ప్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.సతీష్, అడిషనల్ డీఆర్‌డీఓ జయశ్రీ, డీపీఎం శ్రీనివాస్, ఇందిరా మహిళా ఏపీఓ డాక్టర్ నరసింహా, డైరీ ఏపీఎం జె.లక్ష్మణ్‌రావు, ఏపీఎంలు శ్రీనివాసరావు, కొట్టె వెంకటేశ్వర్లు, సీసీలు, సెర్ప్ సిబ్బంది, వీఓఏలు పాల్గొన్నారు.